నేడు ఘట స్థాపన సామూహిక ఊరేగింపు

- హాజరుకానున్న మేయర్ విజయలక్ష్మి, సినీ నటి విజయశాంతి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి
- ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర రోజే పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ



ఘటస్థాపన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు (ఫైల్)

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో బోనాల జాతర రోజే.. పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఊరేగింపు బయలుదేరడానికి ఉత్సవాల నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఊరేగింపు సందర్భంగా ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

కాశీ విశ్వనాథ ఆలయం నుంచి..

- శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది.
- లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదిక పైనుంచి సినీ నటి విజయశాంతి, గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మితో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఘటాలకు స్వాగతం పలుకుతారని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ తెలిపారు.

16న అమ్మవారికి బోనాల సమర్పణ..

పాతబస్తీలోని ప్రధాన ఆలయాలలో అమ్మవారి ఘట స్థాపన ఉత్సవాల అనంతరం ఈనెల 16న అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. 17న, పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించనున్నారు. ఊరేగింపు అనంతరం మరుసటి రోజు అమ్మవారికి సమర్పించే మారుబోనంతో పాతబస్తీలో ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

క్లుప్తంగా...

నేడు నల్ల పోచమ్మకు తొలి బోనం

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ఈనెల 9న తొలి బోనం సమర్పించనున్నట్లు నిర్వాహకుడు పర్వతాల రాజేందర్ తెలిపారు. బోనం సమర్పించిన అనంతరం పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

బోనాలు శాంతియుతంగా జరిగేందుకు సహకరించాలి



ఆలయ నిర్వాహకులతో ఏసీపీ సతీష్‌కుమార్

గోల్కొండ: బోనాలు శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుల్సుంపురా ఏసీపీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం కార్వాన్ సబ్జిమండి నటరాజ్‌నగర్‌లోని నల్లపోచమ్మ, మహంకాళి ఆలయం వద్ద వివిధ శాఖల అధికారుల సమావేశం జరిగింది. వచ్చే వారం నుంచి ప్రారంభం కానున్న సబ్జిమండి బోనాల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. తొట్టెల ఊరేగింపుల, అమ్మవారి ఘటాల ఊరేగింపులు కూడా శాంతియుతంగా జరుగుతున్నాయంటే అందరి సహకారమేనని ఆయన అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కుల్సుంపురా టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్లు అశోక్ కుమార్, శ్రీనివాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఆనందేశీ విజయ్ కిషోర్, దేవాదాయ కమిటీ అధ్యక్షులు ప్యాట నందకిషోర్, కుడుముల రాకేష్, జి. శివ రత్నం, ఎ. అశోక్ కుమార్, కట్ట నర్సింగరావు, గాండ్ల నిరంజన్ బాబు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



దూద్‌బౌలి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోరేటి ఆనంద్‌గుప్తా అన్నారు. శనివారం దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని ఆస్పత్రి వైద్యుల బృందం శిబిరంలో పాల్గొన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా పలు సేవా కార్యక్రమాలను అనేక సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరం ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ జాయింట్ సెక్రటరీ కె.అజయ్ కుమార్ పరిశీలించారు. బీజేపీ నాయకులు వెంకటాచలం ముదిరాజ్, శివకుమార్, నిరంజన్‌కుమార్, లక్ష్మణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీహ: ప్రముఖ కూచిపూడి నృత్య సంస్థ నాట్య విహార్ ఆధ్వర్యంలో నృత్య గురువు శోభా తమన్న శిష్యురాలు ఎం.వర్షిణి కూచిపూడి నృత్య అరంగేట్రం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. బాల గోపాలకృష్ణ, అయిగిరి నందిని, శివస్తకం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సిలికాన్ ఆంధ్ర విశ్వ విద్యాలయ కూచిపూడి శాఖ ప్రొఫెసర్ డాక్టర్ యశోద ఠాక్రే, అభినేత్రి ఆర్ట్స్ డైరెక్టర్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, సిని దర్శకుడు బి.గోపాల్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు



బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయం బోనాల జాతర ఉత్సవాల బ్రోచర్‌ను శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ఆలయ కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఎస్.ఆనంద్‌రావు, ప్రధాన కార్యదర్శులు అల్లి మధుసూదన గిరి, సుమన్‌కుమార్ ముదిరాజ్, కోశాధికారి బొడ్డు సాయిబాబా పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ అభివృద్ధికి కృషి



ప్రజల ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గానికి సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బోజగుట్టకు చెందిన లాల్ బహదూర్‌నగర్, ఆళ్లగడ్డ, వివేకానందనగర్, సాయినగర్‌లకు చెందిన పలువురు శనివారం ఆయనను టోలిచౌకిలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. తమ బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఎవ్వరికి చెప్పుకున్నా కూడా పట్టించుకోవడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్లపై పారుతున్న మురికినీటితో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందిస్తూ ఎమ్మెల్యే కార్వాన్ నియోజకవర్గంలో 292 కోట్ల రూపాయలతో సీవరేజ్ లైన్ వేయడం జరుగుతుందని, ఈ పనులు పూర్తయితే ఎక్కడా కూడా డ్రైనేజీ పొంగిపొర్లే సమస్య ఉండదని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్‌లోని బస్తీలలో సైతం సీవరేజ్ లైన్ల ఆధునీకరణ కోసం నిధులు కేటాయిస్తానని ఆయన అన్నారు.

మంత్రి తలసానికి ఆహ్వానం



మంత్రి తలసానికి ఆహ్వానిస్తున్న కమిటీ ప్రతినిధులు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 75వ వార్షిక బోనాల బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ శనివారం ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, సలహాదారులు రాజారత్నం, కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.పి.క్రాంతికుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

చాంద్రాయణగుట్ట: ఈనెల 16న జరుగనున్న లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ బృందం ఎమ్మెల్సీ కవితను ఆహ్వానించారు. ఆమె నివాసంలో శనివారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్, కన్వీనర్ అరవింద్ కుమార్‌గౌడ్, మాజీ చైర్మన్లు పోసాని విజయ్ కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.



కవితకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న రాజేందర్‌యాదవ్ తదితరులు

హైకోర్టు సీజేకు శుభాకాంక్షలు



చార్మినార్: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకం చేయాలని కొలిజియం సిఫార్సు చేసిన సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. హైకోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది మంచర్ల విష్ణువర్ధన్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విష్ణు మాట్లాడుతూ.. హైకో ర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చేసిన సేవలను కొనియాడారు. పేదలకు సత్వర న్యాయం అందించేందుకు ఆయన కృషి చేశారన్నారు.

మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

సుల్తాన్‌బజార్: దేశంలోని మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో వివిధ కారణాల వల్ల చీలిపోయిన పీఓడబ్ల్యూ నాలుగు సంఘాలన్ని ఒకటిగా ఏర్పాటు చేసి పీఓడబ్ల్యూ అర్ధశతాబ్ది వార్షికోత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళలు, యువతులపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు సంఘటితమై సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సంధ్య, లక్ష్మి, సరూప, అంబిక, శిరోమణి, దీపా తదితరులు పాల్గొన్నారు.

'డీఈఓ రోహిణిపై చర్యలు తీసుకోవాలి'

సుల్తాన్‌బజార్: పోక్సో చట్టం దుర్వినియోగంతో పాటు సాక్ష్యాలు లేక నేరస్తులు తప్పించుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై హైదరాబాద్ డీఈఓ ఆర్.రోహిణి దృష్టికి తీసుకెళ్లగా గతేడాది డిసెంబర్ 20న ఆమె కార్యాలయానికి పిలిపించి బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి డీఈఓపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓ రోహిణి తాను వికలాంగుడని చూడకుండా పిచ్చి పిచ్చి ఆర్టీఏ యాక్ట్ పిటిషన్లు వేస్తున్నావని, సస్పెండ్ చేస్తామని బెదిరించిందని ఆరోపించారు. డీఈఓతో తనకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై జనవరి 5న అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేసేలా నగర సీపీ డీజీపీని చొరవ తీసుకోవాలని కోరారు.

మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి



మాట్లాడుతున్న అమ్మిక రంగయ్య గౌడ్

సుల్తాన్‌బజార్: మాజీ సైనికులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అమ్మిక రంగయ్య గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ సైనికుల కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. జవహర్‌లాల్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న 5977 ఎకరాల 3 గుంటల మాజీ సైనికుల ఫైరింగ్ రేంజ్ భూమిని 35 వేల మంది సైనిక కుటుంబాలకు 250 గజాల చొప్పున ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో అతి త్వరలో మాజీ సైనిక కుటుంబాలతో నిరాహార దీక్షకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎండీ నూర్‌ఖాన్, కసిరెడ్డి, తాహెరున్నిసాబేగం, వర్ధిని, కామరున్నిసా, మార్గరేట్ పాల్గొన్నారు.

నగర పోలీస్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్ సీవీ ఆనంద్‌ను సత్కరిస్తున్న కొమ్ముల నరేందర్

అబిడ్స్: నగర పోలీస్ కమిషనర్‌ను డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు కొమ్ముల నరేందర్ ఘనంగా సత్కారం చేశారు. శుక్రవారం కమిషనర్‌ను ఆయన కలిసి బోనాల ఉత్సవాలకు భారీ ఎత్తున బందోబస్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, మత సామరస్యానికి ప్రతీకగా హైదరాబాద్ నగరం నిలుస్తుందని కొమ్ముల నరేందర్ పేర్కొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఆహ్వానం



అబిడ్స్: ఈనెల 12న గోషామహల్ ప్రాంతంలో జరిగే బోనాల వేడుకల్లో పాల్గొనాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌కు భైరవిమాత ఆలయ ఆలయ చైర్మన్ అర్జున్‌లాల్‌యాదవ్ భగత్ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్‌లాల్ యాదవ్ భగత్ మాట్లాడుతూ... బుధవారం పెద్ద ఎత్తున బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

గురు శిష్య బంధమే జీవనాడి



పురస్కారాల గ్రహీతలతో జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: గురు శిష్యుల బంధమే జీవనాడి అని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో మల్లవరపు జాన్ మధుర సాహిత్య సమితి, జాలుడిల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురికి మల్లవరపు జాన్ సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువులను స్ఫూర్తిగా తీసుకుని సాహిత్య కృషిని కొనసాగించడం అభినందనీయమన్నారు. ప్రముఖ సాహిత్యవేత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, పత్రికా సంపాదకులు శిఖామణి, కవి ముకుంద రామారావులకు పురస్కారాలను అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు కె.కోటేశ్వర్ రావు, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు దార వెంకటేశ్వర్‌రావు, నేషనల్ బుక్ ట్రస్ట్ సంపాదకులు పత్తిపాక మోహన్, మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి గౌరవ అధ్యక్షులు జవహర్, మల్లవరపు సుధాకర్‌రావు, ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం'



చార్మినార్: బోనాల ఉత్సవాలు సుల్తాన్‌షాహిలోని జగదాంబ ఆలయంలో ప్రారంభమయ్యాయని జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ తెలిపారు. శనివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి కూడా మరింత ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 9న అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు, 16న బోనాల సమర్పణ, 17న అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కార్యక్రమాలుంటాయన్నారు. నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారికి స్థానిక ప్రాంతాల భక్తులు ప్రతిఏటా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు.

అమ్మవారికి సేవ చేయడం పూర్వ జన్మ సుకృతం



అరవింద్‌కుమార్‌కు శాలువా కప్పి మెమెంటో అందజేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: అమ్మవార్లకు సేవ చేయడం పూర్వ జన్మ సుకృతమని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపనివార్ల సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. శనివారం ఆయన మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అరవింద్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. నగరంలోని వివిధ అమ్మవారి ఆలయాల వృత్తి పని సంఘం వారిని గౌరవిస్తున్న సందర్భంగా అరవింద్‌కుమార్‌గౌడ్‌ను అమ్మవారి మెమెంటో అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, వృత్తి పని వారు నర్సింగరావు, ధన్‌రాజ్, మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి సురేష్ చారి తదితరులున్నారు.



వర్షాలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు

యాకుత్‌పురా: వర్షాలకు సమస్యలు రాకుండా అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని ఇమ్లిబన్, మౌలాకా చిల్లా, ముర్తుజానగర్, యశ్రఫ్‌నగర్, మదీనానగర్, ధోబీఘట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై వరదనీరు ఎప్పటికప్పుడు ముందుకు వెళ్లిపోయే విధంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. క్రీడా మైదానాలను అభివృద్ధి పరుస్తూ పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

'తెలంగాణలో నియంత పాలన'



బీజేపీ నాయకులతో దేవర వంశీ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో నియంత పాలన కొనసాగుతుందని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పతనం కావడం ఖాయమని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని బీజేపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. ఓ వైపు భారీ ఎత్తున తెలంగాణలో అవినీతి కొనసాగుతుందని, మరోవైపు ఉద్యోగుల ఆకలి కేకలు సీఎం కేసీఆర్ వినిపించుకోవడంలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు పూజారి, రాధాకృష్ణ తదితరులున్నారు.

ఘట స్థాపన ఊరేగింపునకు ఏర్పాట్లు, బందోబస్తు పరిశీలన



ఘట స్థాపన ఊరేగింపుకు బందోబస్తును పరిశీలిస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరగనున్న సామూహిక ఘట స్థాపన ఊరేగింపునకు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం వద్ద ఆయన మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్‌లతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జరగనున్న ఘట స్థాపన ఊరేగింపునకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఘటన స్థాపన ఊరేగింపునకు ఆలయాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహాయ సహకారం అందించాలన్నారు.

మహానేతకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు



నివాళులర్పిస్తున్న కాంట్రాక్టర్స్ జేఏసీ సెక్రెటరి పొల్కం శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న ఆచార్య పెదారపు చెన్నారెడ్డి



గాంధీభవన్‌లో..

నాంపల్లి: దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు టీపీసీసీ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ చిత్రపటానికి పలువురు నేతలు నివాళులర్పించారు. మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఎస్.పి.క్రాంతికుమార్, సి.బాబు, వినోద్ సింగ్, ఎస్‌కె.అఫ్జలుద్దీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ మేలును మరువలేం..

మహానేత వైఎస్సార్ మేలును మరువలేమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ సంచాలకులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలం ప్రాంగణం మాజీ పీఠాధిపతి, దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య పెదారపు చెన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు. దివంగత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఆయన హైదరాబాద్‌లోని వైఎస్సార్ విగ్రహానికి 101 కొబ్బరికాయలను కొట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్రంలో తన రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేశారని కీర్తించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు.

అబిడ్స్‌లో..

అబిడ్స్: దివంగత మహానేత మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పలు ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు నివాళులర్పించారు.